క్లుప్తంగా

నేటి నుంచి శ్రీచౌడేశ్వరిదేవి జాతర

రామసముద్రం : రామసముద్రం మండలంలోని గుంతలపేటలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి జాతర వార్షికోత్సవం బుధవారం నుంచి జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ధ్వజారోహణం, గణపతిపూజ, అమ్మవారి అభిషేకం, కుంకుమార్చన, విశేషాలంకరణ, మహామంగళ హారతి, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం అమ్మవారికి దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 15వ తేదీ త్రిశూలం, వసంతోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు తీసుకోవాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నారాయణ, ఆలయ ధర్మకర్తలు అరుణ్‌కుమార్, శివరాం, బాబు, గంగాధర, చౌడప్ప, వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మకు బోనాలు

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మకు భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. గంగజాతరలో భాగంగా ఐదో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి అభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. పూజలు నిర్వహించి నైవేద్యం, హారతి, తీర్థ ప్రసాదాల వినియోగం చేపట్టారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మంగళవాయిద్యాల నడుమ బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. 108 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాధవరం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతర

గుర్రంకొండ: మండలంలోని గంగిరెడ్డిపల్లెలో శ్రీనలవీరగంగమ్మతల్లి జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. అమ్మవారికి చాందినీబండ్లు కట్టి భక్తులు మొక్కులు చెల్లించుకొన్నారు. జాతరలో ఏపీ రెడ్డిసంఘం గౌరవాధ్యక్షులు వరదారెడ్డి నారద రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జాతర నిర్వహణకు ఆయన విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లారెడ్డి, వార్డు సభ్యులు సోము, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

అటవీ బీట్ ఆఫీసర్స్ బదిలీ

బి.కొత్తకోట : మండలంలో అటవీశాఖ బీట్ ఆఫీసర్స్ బదిలీ అయినట్లు హార్సిలీహిల్స్ సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ మంగళవారం తెలిపారు. చలిమామిడి బీటు అధికారిగా పనిచేసున్న శంకర్ చిత్తూరుజిల్లా ఐరాలకు, కాండ్లమడుగు బీటు అధికారి చిట్టిబాబు రామసముద్రం మండలం చెంబకూరుకు బదిలీ అయినట్లు తెలిపారు. వీరి స్థానాల్లో కొత్తగా ఎవరిని ఇంకా నియమించలేదని తెలిపారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి : మండలంలోని గుండ్లూరు గ్రామంలో గురువారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామ పరిధిలోని ఈతమాను వడ్డిపల్లి, కొర్నమిట్టపల్లి, జగిలవాండ్లపల్లి, కొత్తపల్లి, పెద్దహరిజనవాడ గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటిస్తారన్నారు.

మల్లయ్యకొండ హుండీ ఆదాయం రూ.5లక్షలు

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై గల శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయ హుండీ ఆదాయం మంగళవారం లెక్కించామని ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి, చైర్మన్ మల్‌రెడ్డిలు తెలిపారు. రూ.5,43,158లు వచ్చినట్లు తెలిపారు. శివరాత్రి నుండి ఆలయంలో ఏర్పాటు చేసిన ఈ హుండీలో భక్తులు కానుకలు సమర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో రమణ, కొండకిట్ట, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఘన నివాళి



రైలు ప్రమాద మృతులకు నివాళులు అర్పిస్తున్న వాసవీ మహిళా సంఘం

మదనపల్లె సిటీ: ఒరిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మరణించిన మృతులకు మంగళవారం సాయంత్రం స్థానిక వాసవీభవన్‌వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఆలయం వద్ద నుంచి కొవ్వొత్తులతో నెహ్రూబజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రమాదంలో గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వాసవీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఓలేటి లక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు కుసుమకుమారి, మాణిక్యం, శోభారాణి, వివిధ మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బంగారు భవిత

వాల్మీకిపురం : విద్యా సంస్కరణల విప్లవంతో పాఠశాల దశ నుంచే విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాటలు వేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 64 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 3981 మంది విద్యార్థులకు ప్రభుత్వం విద్యా కానుక అందిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ సహకారంతో ఉన్నత చదువులు చదువుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. నాడు-నేడు కార్యక్రమంతో విద్యాలయాల తీరు కార్పొరేట్‌కు దీటుగా తయారయ్యాయన్నారు. దీంతో నిరుపేదలందరికీ ఉన్నత చదువులు చదువుకునే అవకాశం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రవి నాయక్, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, రఘు, మదనమోహన్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, రాయుడు, ఇర్ఫాన్, షాహెద్, సాధిక్, రాజేష్, ఖాద్రి, సురేష్ రెడ్డి, చంద్రశేఖర్, రాజబాబు, ఎంఈవో వెంకటరత్నం, హెచ్‌ఎం శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



జగనన్న విద్యా కానుక కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

పీలేరు : కేవీపల్లె మండలం గాలివారిపల్లె పంచాయతీ బొప్పసముద్రంలో దారుణ హత్యకు గురైన గణేష్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మృతుని బంధువులను ఓదార్చారు. హత్యకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మృతుని కుటుంబానికి తమవంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, కేవీపల్లె, పీలేరు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు వెంకటరమణారెడ్డి, దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, నాయకులు ఆనంద్, ఉదయ్‌కుమార్, హుమయూన్, షాకీర్, కాలనీ చిన్న తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు అభినందన

మదనపల్లె సిటీ : ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం హెల్పింగ్‌మైండ్స్ సంస్థ సాల్ట్ ఆర్ట్ ద్వారా రక్తదాతలకు అభినందలు తెలియజేశారు. యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సతీష్ సహకారంతో సాల్ట్ ఆర్ట్ వేయడం జరిగిందన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో హెల్పింగ్‌మైండ్స్ సొసైటీ యాప్ అందుబాటులో ఉందని సంస్థ నిర్వాహకులు అబూబకర్ తెలిపారు. రక్తదాతలు తమ పేరు, మొబైల్ నంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు కిరణ్, అమీన్, సయ్యద్, ఖాజా, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె ఎంపీడీఓగా భానుప్రసాద్

మదనపల్లె : మండల ఎంపీడీఓగా భానుప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ పీఎస్.గిరీషా ఉత్తర్వులు జారీచేశారు. మదనపల్లె ఎఫ్ఏసీ ఎంపీడీఓగా పనిచేస్తున్న తాజ్‌మస్రూర్ పదోన్నతుల్లో భాగంగా చిత్తూరు జిల్లా గంగవరం ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ మండల కార్యాలయంలో ఈఓఆర్డీగా పనిచేస్తున్న భానుప్రసాద్‌ను పదోన్నతిపై మదనపల్లె ఎంపీడీఓగా నియమించారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపీడీఓగా భానుప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు చెప్పారు.

పాఠశాల వద్దకే బస్సు పాసులు

మదనపల్లె సిటీ: పాఠశాలలు పునః ప్రారంభం నేపథ్యంలో విద్యార్థుల కోసం వారి పాఠశాల వద్దనే బస్సు పాసులు అందజేస్తామని ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. డిపో వద్దకు వచ్చి బస్సు పాస్ కౌంటర్ వద్దకు వచ్చి సమయం వృధా చేసుకోవద్దని సూచించారు. వన్ డిపో పరిధిలోని మండలాల పాఠశాలల వద్దకు సిబ్బంది వస్తారన్నారు. వారికి తగిన ఆధారాలతో కూడిన జిరాక్స్ పత్రాలు అందజేయాలన్నారు. ఈ విషయం ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు తెలియజేయాలన్నారు. జులై నెలలో శ్రీహరి కోటలో జరిగే శాటిలైట్ లాంచింగ్‌కు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు తెలిపారు.

ఇళ్లు నిర్మించకపోతే పట్టాలు రద్దు

మదనపల్లె : వైఎస్సార్-జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు పొంది ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల పట్టాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి రద్దుపరచి ఇతరులకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అన్నారు. మంగళవారం మండలంలోని పోతబోలు వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. నీటివసతికి సంబంధించి కొత్తగా మూడు బోర్లు వేసినట్లు హౌసింగ్ అధికారులు ఆర్డీఓ దృష్టికి తేగా... పైప్‌లైన్, కరెంట్ కనెక్షన్ త్వరగా అమర్చి నీటిసరఫరా ప్రారంభించాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. పోతబోలు లేఅవుట్‌లో మొత్తం 3,168 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు కేటాయించామని, అందులో 2,400 వరకు ఇళ్లు నిర్మాణపనులు వివిధ దశల్లో జరుగుతున్నాయన్నారు. మిగిలిన 768 ప్లాట్లుకు సంబంధించి నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఖాళీప్లాట్లుకు సంబంధించి వారంలోపు విచారణ చేసి లబ్ధిదారులు నిర్మాణాలకు సుముఖత వ్యక్తపరచకపోతే వాటిని రద్దుచేయాల్సిందిగా రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోతబోలు జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ

బీసీ చైతన్య సభను విజయవంతం చేయండి

గుర్రంకొండ : కర్నూలు జిల్లా ఆదోనిలో నిర్వహించనున్న ఓబీసీ మోర్చా రాయలసీమ బీసీ సామాజిక చైతన్య సభను విజయవంతం చేయాలని జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు రామాంజులు అన్నారు. మంగళవారం గుర్రంకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16న ఆదోనిలోని రిక్రియేషన్ గ్రౌండ్‌లో జరగనున్న బీసీ సామాజిక చైతన్య సభకు పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున బీసీలు తరలివచ్చి బీసీల ఐక్యత చాటాలన్నారు. ఆయన వెంట జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ భరత్, నాయకులు రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

మెనూ అమలుచేయాలి

తంబళ్లపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ మేరకు నాణ్యత భోజనాన్ని వడ్డించాలని డీవైఈఓ కృష్ణప్ప ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని కన్నెమడుగు, తంబళ్లపల్లె, మోడల్‌స్కూల్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ముందస్తు ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి చెందారు. కార్యక్రమంలో ఎంఈవో త్యాగరాజు, హెచ్‌ఎం నాగసుబ్బరాయుడు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విద్యుత్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

మదనపల్లె సిటీ : తిరుపతి నుంచి మదనపల్లెకు త్వరలో నడపనున్న ఆర్టీసీ విద్యుత్ బస్సుల డ్రైవర్ పోస్టులకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ అధికారవర్గాలు తెలిపాయి. 58 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని, 8వ తరగతి పాసై హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆధార్ కార్డు, ఐదు ఫోటోలు, ఆర్‌టీఏ క్లియరెన్సు సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 8341027109, 9182576787ను సంప్రదించాలని కోరారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటుగు ప్రస్తుతము అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలము NVR స్ట్రీట్ డో.నెం. 17-390-2-2-1-3లో కాపురముండు లేట్ షేక్ అహ్మద్ హుస్సేన్ కుమారుడు షేక్ మొహమ్మద్ అక్బర్ బాషా rep by GPA Holder షేక్ మొహమ్మద్ అల్తాఫ్ S/o షేక్ అక్బర్ బాషా, డో.నెం. 17-390-2-2-1-3 లో NVR స్ట్రీట్, మదనపల్లి వారు ఇచ్చు బహిరంగ ప్రకటన ఏమనగా!

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి మా క్లయింట్ తాతగారైన షేక్ అబ్దుల్ మునాఫ్‌గారు ఖాజీ అబ్దుల్ రవూఫ్ సాబ్ గారి నుండి విక్రయించుకొని డో.నెం.1315/1939 విక్రయ దస్తావేజు రిజిస్టర్ రాబడి సంపూర్ణ హక్కు అనుభవము కలిగివుండి, తన ఏకైక కుమారుడు అయిన నా క్లయింట్ తండ్రిగారు షేక్ అహ్మద్ హుస్సేన్‌ను తన ఆస్తికి వారసుడిగా వదిలి 05.06.1964 తేదీన మరణించినారు. నా క్లయింట్ తండ్రి గారికి మా క్లయింట్ మరియు అతని సోదరుడైన లేట్ అన్వర్ బాషాలు సంతానం కాగా, సదరు షేక్ అన్వర్ బాషా తన వారసులుగా షేక్ అక్బర్ బాషా మరియు షేక్ హారున్ బాషాను తన భాగం ఆస్తికి వారసులుగా వదిలి 11.08.1975 తేదీన మరణించినారు. కాగా సదరు అక్బర్ బాషా మరియు హారున్ బాషాలు నా క్లయింట్ అభ్యర్థన మేరకు షెడ్యూలు దాఖలా ఆస్తిలో తనకు రావాల్సిన భాగం ప్రకారం భాగ పరిష్కారానికి సహకరించక దావా భూమిని తనకు ఇవ్వని రీత్యా విక్రయించుటకు ప్రయత్నించగా నా క్లయింట్ రాజశ్రీ మదనపల్లి రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు O.S.No.45/2022 గా దావా దాఖలు చేయగా సదరు దావాలో రాజశ్రీ మదనపల్లి రెండవ అదనపు జిల్లా జడ్జి నా క్లయింట్ పరం షెడ్యూలు దాఖలా ఆస్తిలో సగభాగంను ప్రిలిమినరీ డిక్రీ 28.11.2022 తేదీన పాస్ చేయగా, నా క్లయింట్ తన భాగం ఆస్తిని సపరేటుగా వేరుపరచుటకు గాను ఫైనల్ డిక్రీ పిటిషన్ దాఖలు చేయగా సదరు పిటిషన్ పెండింగ్‌లో ఉన్నది. కాగా సదరు విషయాలు మరుగుపరిచి సదరు షేక్ అక్బర్ బాషా మరియు షేక్ హారున్ బాషాలు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని ఇతరులకు విక్రయించుటకు లావాదేవీలు జరుపుటకు ప్రయత్నించుచున్నారని తెలియవచ్చినది. ఆ విధమైన ఎలాంటి క్రయవిక్రయాలు ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిపై జరిపిన యెడల అవి చెల్లనేరవు మరియు అవి మా క్లయింట్ హక్కు అనుభవములకు ఎలాంటి భంగము కలిగించిన అట్టివారిపై మా క్లయింట్ చట్టపరిధిలో చర్యలు తీసుకోగలదని తెలియజేయడమైనది.

షెడ్యూలు

అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలము పోతుబోలు గ్రామము

1) Sircar Dry S.No.96 Extent Ac.8-10 Cents Full
2) Sircar Dry S.No.97 Extent Ac.1-72 Cents Full
3) Sircar Dry S.No.98 Extent Ac.1-43 Cents Full

A.EHESANULLAH, C.VIJAY KUMAR REDDY, S.AZEEZULLA BASHA, Advocates, Madanapalle.

చెత్త సంపదతో పంచాయతీకి ఆదాయం

వాల్మీకిపురం : పంచాయతీలో వెలువడే చెత్తను సంపద కేంద్రాలకు తరలించడం ద్వారా వచ్చే ఆదాయం ఆయా పంచాయతీల అభివృద్ధికి దోహదం అవుతుందని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని విఠలం పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయరీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అక్కడ చెత్త నుంచి సంపదను తయారు చేస్తున్న విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలలో వెలువడే చెత్తను సంపద కేంద్రాలకు తరలించడం ద్వారా ఆయా పంచాయతీల పరిధి పరిశుభ్రంగా తయారవుతుందన్నారు. చెత్తను తరలించడం ద్వారా సంపదను సృష్టించవచ్చునని, తద్వారా పంచాయతీలను అభివృద్ధి చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. అనంతరం విఠలం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ భారతి, సర్పంచ్ శ్వేత, పంచాయతీ కార్యదర్శులు రజిత, భయారెడ్డి, సూపర్‌వైజర్లు రోహిణి, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



చెత్త సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లె : పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ముషూరు పంచాయతీ దిగువపల్లె సమీపంలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడిచేశామన్నారు. దిగువపల్లెకు చెందిన చవాన్ గంగాసింగ్, ఎం.చంద్రాయుడు, పూజారి కృష్ణమూర్తి, కే.గంగాద్రిలను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు

మదనపల్లె : భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని సచివాలయాల్లో భూక్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశాన్ని రాష్ట్రప్రభుత్వం కల్పించిందని ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ రాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని 8 గ్రామాల్లో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ పూర్తయిందన్నారు. దీంతో చిప్పిలి, తేనీగలవారిపల్లె, పప్పిరెడ్డిగారిపల్లె, కాశీరావుపేట, మొలకలదిన్నె, బ్రాహ్మణవాండ్లపల్లె, పామయ్యగారిపల్లె, ముతకసపల్లె గ్రామాల పరిధిలోని సచివాలయాల్లో ఇకపై భూరిజిస్ట్రేషన్‌లు చేసుకోవచ్చన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పడిగాపులు లేకుండా సొంత గ్రామంలోనే రిజిస్ట్రేషన్లు చేసుకునే అరుదైన అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెవిన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

కలకడ : మండలంలోని రైతుల భూములు, రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని తహసీల్దార్ ప్రదీప్ ను ఎంపీపీ శ్రీదేవి కోరారు. ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్‌ను మంగళవారం ఆమె కలసి శాలువ కప్పి సన్మానించారు. ప్రభుత్వ భూములను కాపాడే ప్రధాన ధ్యేయం రెవిన్యూశాఖ సిబ్బందిపై ఉందని గుర్తు చేశారు.

ముఖ్యమంత్రి నూతన ఆశయాలకు అనుగుణంగా అర్హత కలిగిన వారికి నూతన బియ్యం కార్డులు మంజూరు, అదనపు నమోదులో సమస్యలు లేకుండా చూడాలన్నారు.

23న జాతీయ సదస్సు

మదనపల్లె సిటీ: మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఈనెల 23, 24 తేదీల్లో 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో మహిళల అభివృద్ధి - సవాళ్లు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో మహిళల అభివృద్ధి- సవాళ్లు అనే అంశాలకు సంబంధించిన పరిశోధక వ్యాసాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పరిశోధకులు పై అంశాలతో పాటు వివిధ రంగాల్లో అభివృద్ధి చెందిన మహిళామణులను గురించి రాయవచ్చునన్నారు. తమ విలువైన పత్రాలను జూన్ 15లోపు 5 పేజీలు మించకుండా ఏ4 సైజులో ప్రియాంక ఫాంటు 18 లైన్ల స్పేస్ 21తో పేజ్‌మేకర్‌లో పంపాలన్నారు. వివరాలకు డాక్టర్ బి.జ్యోతి 9963655576, వనజ 9908946622ను సంప్రదించాలని కోరారు.

ఘన జీవామృతం వాడాలి

వాల్మీకిపురం : ప్రకృతి వ్యవసాయంలో ఘన జీవామృతం వాడడం వలన పంటలకు ఎంతో మేలని ప్రకృతి వ్యవసాయ మండల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ రెడ్డిబాషా అన్నారు. మండలంలోని బూడిదవేడు పంచాయతీలోని రైతులకు మంగళవారం ప్రకృతి వ్యవసాయంలో ఘన జీవామృతం వాడకం వలన కలిగే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా చేసి చూపించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెడ్డిబాషా మాట్లాడుతూ ఘన జీవామృతాన్ని పంటసాగులో వాడటం వలన భూమి లోపల ఎక్కువ సంఖ్యలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని, తద్వారా మొక్కకు కావాల్సిన పోషకాలు అందుతాయని రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెద్ద రెడ్డెయ్య, భాస్కర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారం అందించాలని విన్నపం

కేవీపల్లె : మండల అభివృద్ధికి సహకారం అందించాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కేవీపల్లె జెడ్పీటీసీ గజ్జెల శృతి విన్నవించారు. మంగళవారం తిరుపతిలో మంత్రిని కలసి పలు సమస్యల గూర్చి తెలియజేసి పరిష్కరించాలని కోరారు. మండలంలో పలు గ్రామాలకు రోడ్లు మంజూరయ్యాయని, త్వరిత గతిన పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. జగనన్న కాలనీలో మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుడిని ఆదుకోవాలి

మదనపల్లె : గొర్రెలపాకపై హైనాలు దాడిచేయడంతో 40 గొర్రెలు మృతిచెంది నష్టపోయిన పెంపకందారుడు వెంకటరమణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తంబళ్లపల్లె నియోజకవర్గం, బి.కొత్తకోట మండలం, బడికాయలపల్లెలో మంగళవారం వేకువజామున గొర్రెలపాకపై హైనాలు దాడిచేసి 40 గొర్రెలను చంపిన ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రచార రథాలు ప్రారంభం

మదనపల్లె : పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లో ఈనెల 19న జరుగనున్న బహుజన రాజ్యాధికార సభకు సంబంధించిన ప్రచార రథాలను మంగళవారం బీఎస్పీ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ప్రారంభించారు. గాంధీపురంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలహారం వేసి నివాళులర్పించిన అనంతరం ప్రచార వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బందెల గౌతమ్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికార సభకు బీఎస్పీ రాజ్యసభ ఎంపీ రాంజీగౌతమ్, డాక్టర్.ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, ఐపీఎస్, బీఎస్పీ ఏపీ అధ్యక్షులు బి.పరంజ్యోతి హాజరవుతారన్నారు.

బహుజనులను రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేసేందుకు నిర్వహిస్తున్న సభకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు రెడ్డెప్ప, బురుజు లక్ష్మీనారాయణ, సహదేవ, రమణ, శ్యామ్, బాలాజీ, గంగాధర తదితరులు పాల్గొన్నారు.